
ప్రజాశక్తి

సోమవారం 4 మార్చి 2024

5

పార్వతీపురం మన్యం



స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వడం కన్నా ఆయన సిఫార్సులు అమలు చేస్తే దేశంలో గల కోట్లాదిమంది రైతులకు మేలు జరుగుతుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో పట్టణ నాయకులు వెంకట్రావు, గణేష్‌తో కలిసి గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పిస్తూ చట్టం చేయాలని రైతులు ఢిల్లీ సమీపంలో ఆందోళన చేస్తుంటే మోడీ ప్రభుత్వం అణిచివేత ధోరణి అవలంభిస్తోందని అన్నారు. రైతులపై కాల్పులు జరిపి ప్రాణాలు తీయడం దుర్మార్గమని అన్నారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇరిగేషన్ భూమిపై కన్ను

- అడ్డుకొనే నాథుడే కరువు
- ఇష్టారాజ్యంగా కబ్జాదారుల ఆక్రమణలు

వాగులు -వంకలు, కొండలు-కోనలు, గట్టలు -పుట్టలు, అలాగే చెరువులు ఎక్కడ ఖాళీ జాగా ఉన్నా ఆక్రమణదారుల కబ్జాకు హద్దే లేదనడంలో అతిశయోక్తి లేదు. ఆఖరుకు ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా అధికారులు కూడా మిన్నకుండే పరిస్థితి. వివరాల్లోకి వెళ్తే...



డబ్రీస్ వేసి ఆక్రమిస్తున్న స్థలాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఖడ్గవలస, ఎర్రగుడి జంక్షన్ వద్ద ఆక్రమణలు జరిగే శాశ్వత నిర్మాణాలు చేపట్టిన విషయం అధికారులకు తెలిసిన విషయమే. అయితే ఈ విషయంలో అధికారులు పలుమార్లు ఆక్రమణదారులకు నోటీసులు మంజూరు చేసినప్పటికీ రాజకీయ నాయకుల అండదండలతో ఆ నోటీసులు చిత్తుకాగితాలకే పరిమితమైపోతున్నాయి. ఇటీవల కాలంలో ఉల్లిభద్ర వద్ద తోటపల్లి కుడి ప్రధాన కాలువ నుండి డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ సెంటర్ మెయిన్ గేట్ వరకు ఉన్న నీటిపారుదలశాఖ భూములపై కబ్జాదారులు కన్ను పడింది. దీంతో భూముల్లో కబ్జాదారులు తమకు అనుకూలమైన ప్రదేశంలో మట్టి, డబ్రిస్‌తో చదును చేస్తున్నారు. గతంలో ఇలాగే మొతటి చదును చేసి ఆ తర్వాత నిర్మాణాలను ప్రారంభించి వాటి విక్రయించేశారు. అయితే ప్రస్తుత పరిస్థితి చదునులోనే ఉన్నందున అధికారులు ఆదిలోనే అడ్డువేయాలని, లేకుంటే మొత్తం భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ఆక్రమణలను అడ్డుకునే నాథుడే లేడా?

పాలకొండ నుండి పార్వతీపురం వెళ్లే రహదారికి అనుకొని తోటపల్లి కుడి ప్రధాన కాలువకు అలాగే డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ గేటుకు మధ్య గల నీటిపారుదలశాఖకు చెందిన సుమారుగా 3 ఎకరాల భూమి ఉంది. ప్రజాప్రతినిధుల అండదండలతో ప్రభుత్వ స్థలం కబ్జా చేయడం కొందరు పనిగా పెట్టుకొని వారసత్వ ఆస్తులు మాదిరిగా విక్రయాలు చేయడం పనిగా మారిపోయింది. ఇరిగేషన్‌శాఖకు సంబంధించిన ఆస్తులు ఎర్రన్న గుడి జంక్షన్ వద్ద నుండి తోటపల్లి కుడి ప్రధాన కాలువ వరకు కొంత భాగం ఆక్రమణ జరిగి శాశ్వత నిర్మాణాలు జరిగిన విషయం అధికారులకు తెలిసినా, అంగుళం కూడా కదపలేని పరిస్థితి. ఈ ఆక్రమణల పట్ల అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు.

నీటిపారుదలశాఖకు సంబంధించిన స్థలాలైన ఎర్రన్నగూడ జంక్షన్ వద్ద ఆక్రమణదారులకు గతంలో నాలుగు సార్లు నోటీసులు జారీ చేశాం. అయినా వారు ఏమీ పట్టినట్లు విచ్చలవిడిగా ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమిస్తున్నట్టు తెలిసింది. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తప్పవు. యంత్రాలతో తొలగించక ముందే అక్రమదారులు తమ ఆక్రమణలను తొలగించాలి. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.


కిశోర్,
ఇరిగేషన్ ఎఇ.

ఎన్నికల ముందే తాయిలాలిస్తూ...

- ఆత్మీయత పేరిట కానుకలు ఎర
- నోటిఫికేషన్‌కు ముందే ప్రారంభం

ఔను...! సిద్ధమయ్యారు... ఎన్నికలకు ముందే ఆత్మీయ సమావేశాల నిర్వహణకు, ఆ పేరిట కానుకల పంపిణీకి అధికార పార్టీ సిద్ధమైంది. అక్కడక్కడా ప్రతిపక్షమూ అటువంటి దారిలో నడిచేందుకు ఇప్పుడిప్పుడే బయలుదేరినట్టుగా కనిపిస్తోంది. సుమారు పది రోజులుగా అధికార పార్టీ అభ్యర్థులు, ఇన్‌ఛార్జులు ఆధ్వర్యాన విందులు, వినోదాలు ప్రారంభమయ్యాయి. అందులోనే చీరలు, సారెలు తదితర కానుకల పంపిణీ సాగుతోంది. ఎన్నికల్లో వివిధ తరగతులను లోబరుచుకోవడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు సాగుతున్నాయని జనం చర్చించుకుంటున్నారు. బహుషా ఎన్నికల కోడ్‌కు ముందే ఇటువంటి కార్యక్రమాలన్నీ పూర్తవుతాయేమో!!.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



గతంలో పరిమితమైన స్థానాల్లో మినహా ఎన్నికల నోటిఫికేషన్ వరకు అభ్యర్థులు జాబితా విడుదలయ్యేది కాదు. అటు టిడిపి, ఇటు వైసిపి ఏడాది క్రితం నుంచి ఎన్నికల వాతావరణం సృష్టించడంతో ఇరు పార్టీల్లోనూ దాదాపు సగం మంది అభ్యర్థుల పేర్లు ఖరారైపోయాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అధికార పార్టీ తరపున దాదాపు సిట్టింగులేనని లోలోపల ఖరారు చేసినట్టుగా సమాచారం. ఇటు టిడిపి కూడా మూడు చోట్ల మినహా మిగిలిన అన్ని చోట్లా అభ్యర్థులను ప్రకటించింది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ, దానికి ముద్దతుగా మరో సంస్థ ఓ అడుగు ముందుకు వేసి వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వృద్ధులు, వికలాంగులు, ఉపాధ్యాయులతో సభలు, సమావేశాలు నిర్వహించి అందులో విందులు, వినోదాలతో ముంచెత్తుతున్నాయి. ఇటువంటి కార్యక్రమాలు ఇప్పటి వరకు గజపతినగరం, విజయనగరం, పార్వతీపురం, శృంగవరపుకోట తదితర చోట్ల బహిరంగంగానే జరుగుతున్నాయి. పార్వతీపురంలో అధికార పార్టీకి చెందిన ఓ నేత ఏకంగా చీరలతోపాటు డబ్బులు కూడా పంపిణీ చేశారు. విజయనగరంలో నెల రోజుల క్రితం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమైన నేత, నేడో రేపో ఏకంగా ఉపాధ్యాయల కుటుంబాలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. అందులో కానుకలు కూడా పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టుగా కూడా ప్రచారం జరుగుతోంది.

సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితర విభాగాలకు వైసిపి తరుపున ఓ సంస్థ కూడా బహుమతులు ప్రదానం చేస్తున్నట్టుగా చర్చ నడుస్తోంది. నోటిఫికేషన్ తరువాత ఇటువంటి కార్యక్రమాలు, పంపిణీ వంటివి నిర్వహిస్తే ఎన్నికల నిబంధనావళి అడ్డువస్తుందనే ఆలోచనతో ముందస్తుగానే సిద్ధమౌతున్నట్టుగా అర్థమౌతోంది. విందులు, కానుకలతో ఎన్నికల్లో గట్టెక్కాలని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఓటర్లు మాత్రం అందుకు సిద్ధం కాబోరని, ఇచ్చినవన్నీ తీసుకుని బాగా ఆలోచించే ఓటేస్తారని ఆశిద్దాం.



పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పోలియో రహిత సమాజం ఆవిష్కృతం కావాలి

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

పోలియో రహిత సమాజం ఆవిష్కృతం కావాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన పట్టణంలోని డబ్బివీధి దగ్గరలో గల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రం వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశం పోలియోరహిత దేశంగా ప్రకటించడం జరిగిందని, అయితే చుట్టు పక్కల ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ తదితర దేశాల్లో ఇంకా కేసులు వస్తున్నాయని అన్నారు. పోలియో బారిన పడకుండా సార్వజనీన కార్యక్రమం కింద దేశంలో వేయడం జరుగుతుందని చెప్పారు. ఐదేళ్లలోపు వయస్సు గల పిల్లల తల్లిదండ్రులు, పిల్లలకు పోలియో వైరస్ సోకకుండా రెండు చుక్కలు వేయించాలని కోరారు. రెండు చుక్కలు వేయించడంలో నిర్లక్ష్యం వహిస్తే జీవితం కష్టాల మయమవుతుందన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేయడంతో పాటు వారి జీవితాలు ఆరోగ్యకరంగా, ఆనందకరంగా సాగేందుకు సహకరించాలని కోరారు. పోలియో చుక్కల బూత్‌లతో పాటు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్ల వద్ద ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంచార జీవనం గడిపే వారు కూడా పిల్లలకు చుక్కలు వేయించాలని చెప్పారు.

మావుడి ఆశ్రమ ఉన్నత పాఠశాల సందర్శన

మండలంలోని మావుడి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆల్ ద బెస్ట్ చెప్పారు. చక్కగా చదువుకొని భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులకు పలు సూచనలు చేసి పరీక్షలు బాగా రాసి తల్లిదండ్రులకు, గ్రామానికి, పాఠశాలకు, పాఠశాల సిబ్బందికి మంచి పేరు తీసుకొని రావాలన్నారు. ఒత్తిడి వద్దని ప్రశాంతత ముఖ్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా బగాది జగన్నాథ రావు, డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా శివ కుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ పద్మావతి, పలువురు ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నివురుగప్పిన నిప్పులా గ్రూపు రాజకీయాలు

నేడు వైసిపి నియోజకవర్గ కీలక సమావేశం

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ అధికారపార్టీలో అసమ్మతి, గ్రూపు రాజకీయాలు నివురుగప్పిన నిప్పులా వున్నాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా, రాష్ట్ర నాయకులు కింద స్థాయి కేడర్ సమస్యలు, యోగ క్షేమాల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మండల స్థాయిలో ఎంపిపి స్థాయి నాయకులు తప్ప జెడ్పిటీసీ, ఎంపిటిసి, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు ఉత్సవ విగ్రహాలుగానే ఉన్నారు. సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ ఏర్పడిన తర్వాత తమకు గ్రామాల్లో, పట్టణాల్లో కనీస గౌరవ మర్యాదల్లేవనే అసంతృప్తి వారిలో గూడు కట్టుకొని ఉంది. మండల, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో వైసిపి బలపర్చిన అభ్యర్థులను ఎక్కువగా గెలిపించినా తగిన గుర్తింపు లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో లక్షలు ఖర్చు చేసి పదవుల్లోకి వచ్చి మూడేళ్లయినా ప్రభుత్వం నుంచి ఎలా భరోసా రాలేదనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయిలో ఒకరిద్దరు నాయకులు తప్ప మిగిలిన నాయకులంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయి ఉన్నామని ఎవరికి వారే చెపుతున్నారు. ఇలాంటి సమస్యలతో పాటు మండలాల్లో గ్రూపు రాజకీయాలు కూడా వున్నాయి. సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాల్లో వైసిపి నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేదు. ఒక గ్రూపు నాయకులు ఔనంటే మరో గ్రూపు నాయకులు కాదనే పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా మండల స్థాయిలో కొంతమంది నాయకులు మితిమీరిన దందాలు, దౌర్జన్యాల కారణంగా గ్రామ స్థాయి కేడర్‌లో అసంతృప్తి సెగలు రగులుతున్నాయి. ఈ నేపథ్యంలోనే



ఇటీవల సాలూరు మండలంలో తోణాం పంచాయతీ నుంచి కొంతమంది కార్యకర్తలు వైసిపిని వీడి టిడిపిలో చేరినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సిఎం రాజన్నదొర ఇంతవరకు ఆ కొద్దిమంది నాయకుల దందాలు, దౌర్జన్యాల గురించి తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరించారు.

ఇప్పుడు ఎన్నికల ముహూర్తం సమీపిస్తున్న కొద్దీ స్థానిక నాయకులు, కార్యకర్తల్లో అసమ్మతిరాగం వినిపిస్తోంది. మున్సిపాలిటీలోనూ గ్రూపు రాజకీయాలు నివురుగప్పిన నిప్పులా వున్నాయి. పాలకవర్గం ఏర్పాటు నుంచి వైసిపి నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేదు. రెండున్నరేళ్లు దాటిన తర్వాత చైర్‌పర్సన్ మార్పునకు సంబంధించిన అంశం ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది. తాజా పరిణామాలు అధికారపార్టీని వేధిస్తున్నట్లు పైకి కనిపిస్తున్నా వాటితో ఇప్పటికిప్పుడు పార్టీకి నష్టం చేకూరే పరిస్థితి కనిపించడం లేదు. అయితే నియోజకవర్గ టిడిపిలో కూడా బలమైన నాయకత్వం లేకపోవడం, అక్కడ కూడా గ్రూపు రాజకీయాలు బలంగా ఉండడం వంటి అంశాలు అధికారపార్టీకి వరంలా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి నియోజకవర్గ సమావేశం సోమవారం ఉదయం 10గంటలకు జరగనుంది. డిప్యూటీ సిఎం రాజన్నదొర అధ్యక్షతన జరగనున్న సమావేశానికి పార్టీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరు కానున్నారు. మరో నెల రోజుల్లో ఎన్నికలు ఎదుర్కోనున్న నేపథ్యంలో పార్టీ నాయకులను, కార్యకర్తలను సమాయత్తం చేయడానికి సమావేశం నిర్వహిస్తున్నారు. పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసే దిశగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కార్యాచరణ రూపొందించనున్నారు.

టిడిపి టికెట్‌పై వీడని ఉత్కంఠ

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లాలోని పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన తెలుగుదేశం పార్టీ టికెట్ పై నేటికి ఉత్కంఠగా ఉంది. మొదటి జాబితాలో మన్యం జిల్లాలో అన్ని టికెట్లు ఖరారు చేసినప్పటికీ కేవలం పాలకొండ సీటు విషయంలో ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇటీవలె శ్రీకాకుళం వచ్చిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా ఎటువంటి హామీ కూడా ఇవ్వనట్లు సమాచారం. తమకే టికెట్ వస్తుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జయకృష్ణ వర్గీయులు చెప్తున్నప్పటికీ, ఆయన పేరు ఖరారు చేయకపోవడం పట్ల పార్టీలో చర్చనీయాంశంగా మారింది. మొదటి నుంచి జయకృష్ణకు టికెట్ ఇవ్వొద్దని ఓ బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకులు గట్టిగానే పోరాడుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు జయకృష్ణ ఓటమి పాలయ్యారని, అభ్యర్థిని మారిస్తే గెలుపు సులువు అవుతుందని, ఆ నేతలు పార్టీ నాయకులకు చెప్తున్నట్లు తెలుస్తుంది.

ఎందుకు జయకృష్ణ పేరు ప్రకటించడం లేదు?

పార్వతీపురం మన్యం జిల్లాలో అన్ని సీట్ల అభ్యర్థులను ఖరారు చేసిన టిడిపి పార్టీ పాలకొండ అభ్యర్థి విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. ఇన్-ఛార్జ్ గా ఉన్న జయకృష్ణ అభ్యర్థిని ఆయన వర్గీయులు చెప్తున్నప్పటికీ అధికారకంగా ప్రకటన రాలేదు. స్థానికంగా ఉన్న కేడర్ కలుపుకోకపోవడంతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షులు కూడా ఆయనకు వ్యతిరేకంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఏదేమైనా టిడిపి టికెట్ విషయంలో కొద్ది రోజుల వరకు స్పష్టత వచ్చే పరిస్థితి లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు


పల్లె రహదారులకు మోక్షం కలిగేనా?

ప్రజలకు తప్పని అవస్థలు పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఏ గ్రామంలోని రోడ్లను చూసినా అధ్వాహ్నంగా దర్శనమిస్తున్నాయి. మీ గ్రామాలకు రహదారి సౌకర్యంతో పాటు అనేక మౌలిక వసతులు కల్పిస్తామని సమయం వచ్చినప్పుడల్లా పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితమవుతున్నారు తప్ప ఆచరణలో ఎక్కడా కాన రావటం లేదు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని నానుడు. అప్పట్లో పల్లెలు ఆహ్లాదకరంగా ఎంతో ముచ్చటగా కనిపించడంతో ఎక్కువగా ప్రజలు పల్లెలను చూసేందుకు ముచ్చట పడేవారు. ఇప్పుడు ఆ పల్లెల రహదారులు దుమ్ము, ధూళితో దర్శనమిస్తున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా, ఎక్కడ చూసినా పల్లెల రహదారులు అధ్వానంగానే దర్శనమిస్తున్నాయి. ఇటువంటి రహదారులపై ప్రయాణించాలంటే సాహసించాల్సిందే. అటువంటి రహదారులే మండలంలోని ప్రతి గ్రామంలో దర్శనమిస్తున్నాయి.

మండల కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు యు.వెంకంపేట, నీలంపేట, ఎలిసాపురం, సంధిమానుగూడ, బట్టి మానుగూడ, కాగితాడ, గదబవలస, పివిఆర్ పురం,



రాలు తేలిన కొట్టు గుమ్మడ రహదారి

చిదిమి, చేబియ్యంవలస, డిపి వలస, బల్లగుడ్డి, కె.ఇచ్ఛాపురం, తదితర పల్లెల రహదారులు నేటికీ అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలకు రాకపోకలు సాగించేందుకు అవస్థలు తప్పటం లేదు. మండలంలోని హుస్సేన్ పురం సెవెంత్ బ్రాంచి కాలువ నుండి ఈ గ్రామం మీదుగా నీలంపేట నుంచి సందిమానుగూడ వరకు గత ప్రభుత్వ హయాంలో 2019లో రూ 4.67 కోట్లతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు మట్టిని లెవెల్ 40 ఎంఎం చిప్స్ వేసి రోలింగ్ చేసి అలాగే వదిలేశారు. సిఎస్‌పి రహదారి నుండి యు వెంకంపేట మీదుగా చిదిమి వరకు కోటి రూపాయలతో బిటి రహదారి నిర్మించేందుకు పనులు చేపట్టారు. ఆడారు బిటి రహదారి నుండి డిపి వలస వరకు కోటి రూపాయలతో బిటి రహదారి నిర్మించేందుకు పనులు చేపట్టారు. సిఎస్‌పి రహదారి నుండి చిదిమి వరకు రూ.కోటీ21 లక్షలతో బిటి రహదారి నిర్మించేందుకు పనులు చేపట్టారు. అయితే ఎక్కడ కూడా రహదారుల పనులు పూర్తికాకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో దర్శనమిస్తున్నాయి. ఈ కారణంగా పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బీటలు వారిన బిటి రహదారులు

మండలంలోని కొట్టుగుమ్మడ, ఎం.రాజపురం, తలవరం, కంబర, చిట్టిపూడివలస తదితర గ్రామాల బిటి రహదారులు బీటలు వారి దర్శనమిస్తున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారి నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాలం చల్లకుండానే రహదారులు ఎక్కడికక్కడే గుంతలు ఏర్పడి, రాలు తేలి ఉన్నాయి. దీంతో ముఖ్యంగా విద్యార్థులు, గర్భిణీలు, వద్దులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారుల అభివృద్ధిపై తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చిప్స్ వేసి వదిలేసిన డిపి వలస రహదారి

సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులు సాగు చేస్తున్న పోడు, అన్యాక్రాంతమైన భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం నాయకులు రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల5న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ గుమడ సంతలో ప్రచారం, ర్యాలీ ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు రాము, మంగులు, లక్ష్మ, సిఐటియు జిల్లా కమిటీ నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ జిల్లాలో తరతరాలుగా పేదలు, గిరిజనులు సాగు చేస్తున్న ప్రభుత్వ బంజర భూములకు డి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన పేదల పట్టా భూములు తిరిగి వారికి ఇవ్వాలని, కొండపోడు సాగు చేస్తున్న గిరిజనులకు ప్రతి కుటుంబానికి పది ఎకరాల వరకు పోడు పట్టాలి ఇవ్వాలని కోరారు. వీటితో పాటు ఉపాధి హామీ కింద 200 రోజులు పని దినాలు, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, తదితర సమస్యలపై ఈనెల 5న ఇవ్వాలని ఈ సమస్యల పైన మార్చి 5వ తేదీ అనగా మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా ఉంది కాబట్టి దళితులు గిరిజనులు వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశు, రామారావు, బలరాం సుబ్బారావు, మంగులు, పోలినాయుడు వెంకటేష్ పాల్గొన్నారు.



సంతలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలు అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

ప్రజాశక్తి - భామిని

మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వి.కళావతి శంకుస్థాపనలు చేస్తారని మండల వైసిపి కన్వీనర్ తోట సింహాచలం తెలిపారు. గురండి నుంచి నేరడి వరకు రూ.60లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు పనులకు, బి.చమనుగూడ నుంచి జియమనుగూడ వరకు రూ.కోటీ 50లక్షలతో చేపడుతున్న బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారని, అనంతరం భామిని ఎంపిడిఒ కార్యాలయంలో నవరత్నాలు -అందరికి ఇళ్లు పథకాల్లో భాగంగా ఇంటి స్థలాలు పొందిన వారికి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తారని తెలిపారు.

5న సర్కిల్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని గత కొంత కాలంగా చినమేరంగిలో సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే నూతన భవన నిర్మాణం పూర్తయినప్పటికీ వివిధ కారణాల వల్ల ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఈ భవనాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 5న ప్రారంభిస్తున్నట్లు సిఐ కె.మురళీధర్ తెలిపారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రం పరిధిలో ఎవరైనా ఎటువంటి అక్రమ రవాణాకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌పి సునీల్ షరైన్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి, ఆదివారం పలు కూడలి వద్ద, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌తో పాటు పలు కూడళ్ల వద్ద పోలీస్ సిబ్బందిచే ఆకస్మిక తనిఖీలను నిర్వహించి సారాయి, గంజాయి, నగదు, మద్యం అక్రమ రవాణాలను నేర నియంత్రించడంలో భాగంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. అలాగే పట్టణంలోని లాడ్జీల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ పివివిఎస్‌ఎన్ కృష్ణారావు, ఎస్‌ఐలు, సంతోషిని, రవీంద్ర రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో చర్చిస్తున్న గ్రామదర్శిని సభ్యులు

అంటికొండలో గ్రామదర్శిని

ప్రజాశక్తి - సీతంపేట

మన్య ప్రగతి ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు, సంస్కృతి - సంప్రదాయాలు, గ్రామాల అభివద్ధి - మానవ సంబంధాలు పై 'గ్రామ దర్శిని - ప్రజా చైతన్య అవగాహనా కార్యక్రమం' మండలంలోని అంటి కొండలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్య ప్రగతి చైర్మన్ గేదె రవి మాట్లాడుతూ గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది - మహాత్మా గాంధీ స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. అంటికొండలో కుల పెద్దలు, గ్రామ ప్రజలతో కలిసి సంస్కృతి, సంప్రదాయాలు రాబోయే తరాలకు అందించడం, గిరిజన సమస్యలు గురించి చర్చించి ఉన్నత అధికారుల వద్దకు తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్య ప్రగతి అధ్యక్షులు గేదెల జనార్ధన రావు, జనరల్ సెక్రటరీ మీనక ఉమా మహేశ్వరావు, టీం సభ్యులు పాలక సాంబయ్య తదితరులు మాట్లాడారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

ప్రజాశక్తి - పాలకొండ



అనాథ వృద్ధురాలికి ఆహారం అందజేస్తున్న ఎస్ఐ

స్థానిక ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ అనాథ అయిన ఓ వృద్ధురాలికి సాయం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఇంటర్ పరీక్షా కేంద్రమైన సాహితీ కాలేజీకి బందోబస్తులు నిమిత్తం ఇటీవల ఎస్ఐ ప్రశాంతకుమార్ వెళ్లారు. ఆ కాలేజీ ఆవరణలో గల వడం చెరువు గట్టుపై ఓ పాకలో అనాథగా ఉన్న ఓ వృద్ధురాలిని చూశారు. ఆమె వద్దకు వెళ్లి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె కష్టాన్ని తెలుసుకొని చెల్లించిపోయిన ఆయన ఆమెకు తినుబండారాలు, ఛార్జింగ్ లైట్ ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అడ్డాపుశీలలో ఎన్ఎస్ఎస్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోని శ్రీసాయిరాం డిగ్రీ కాలేజీ విద్యార్థుల ఎన్ఎస్ఎస్ క్యాంపు మూడో రోజు కార్యక్రమంలో భాగంగా అడ్డాపుశీలలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పట్టణానికి చెందిన శ్రీ సౌజన్య హాస్పిటల్ అధినేత ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ పిబిపిఆర్ నాయుడు (నాని), శ్రీకాకుళం జెమ్స్ హాస్పిటల్ అత్యవసర విభాగం డాక్టర్ వంశీకృష్ణ రోగులకు తనిఖీ చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రతినిధి పెంట అప్పారావు, ప్రిన్సిపల్ జి. శ్రీధర్, యూనిట్ ప్రోగ్రాం అధికారులు డి.దేవి, తిరుపతిరావు ఆధ్వర్యాన నిర్వహించారు. అనంతరం పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి జంక్షన్ సమీపంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మణికంఠ (27) మృతి చెందగా, నలుగురికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నుంచి అనూష, ఆమె భర్త చంద్రకాంత్ ద్విచక్ర వాహనంపై కొత్తూరు వెళ్తుండగా అదే సమయంలో విజయనగరం జిల్లా రాజాం నుండి ముగ్గురు యువకులు మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి తిరిగి రాజాం వెళ్తున్నారు. మితిమీరి వేగంతో కుసిమి జంక్షన్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొనడంతో మణికంఠ (27) తలకు గాయం కావడంతో పాలకొండ ఏరియా ఆసుపత్రికి తీసుకొని వెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మరో నలుగురికి గాయాలు అయ్యాయి. ఎస్సై ఎం.జగదీష్ నాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో గాయపడ్డ క్షతగాత్రులు

నిండు జీవితానికి రెండు చుక్కలు

పలుచోట్ల పల్స్ పోలియో కార్యక్రమాలు



పార్వతీపురం : పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

భవిష్యత్తు తరాల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు కలిసి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలియో మహమ్మారి శాశ్వత నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఐదేళ్లలోపు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు అందించేందుకు నేటి నుంచి మంగళవారం వరకు పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగనుందని తెలిపారు. దీన్ని చిన్నపిల్లల తల్లిదండ్రులు వినియోగించుకొని పోలియో మహమ్మారికి దూరంగా ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి, వైసిపి సీనియర్ నాయకులు , ఏపీ ఎన్జీవో అధ్యక్షులు కిషోర్, వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

కురుపాం : పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా కురుపాంలోని బస్టాండ్ వద్ద ఎంపిపి శెట్టి పద్మావతి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు . మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి బి.ప్రజ్ఞ పిహెచ్‌సి పరిధిలో గల చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్లు, ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలోని పి.చాకరాపల్లి, మురగడాం, అజ్జాడలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి. జగన్ మోహనరావు ఆదివారం తనిఖీ చేశారు. పోలియో చుక్కలు వేయాల్సిన పిల్లల లక్ష్యాన్ని ఏ మేరకు పూర్తి చేస్తున్నారో పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కురిటి మోహనరావు, ఎంపిహెచ్ఇఒ నారాయణరావు, వైద్య సిబ్బంది చిన్నమ్ములు, సోనియా, రాములు నాయుడు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : 0-5 ఏళ్లలోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డిఐఒ డాక్టర్ ఎం.నారాయణ కోరారు. మండలంలోని లోవముఠా ప్రాంతంలోని దుడ్డుఖల్లు, రేగిడి పిహెచ్‌సిల పరిధిలో జరుగుతున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. శతశాతం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం జరిగేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు జయగౌడ్, రమణ, ఆరోగ్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట, డుమ్మంగి గ్రామాల్లో సర్పంచులు బి.గౌరీశంకర్ రావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, ఆర్.చైతన్య స్రవంతి, పాలక క్రాంతికుమార్, ఎంపిటిసి కడ్రక మల్లేశ్వరరావు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు.

చక్కగా చుక్కల మందు పంపిణీ

పార్వతీపురం రూరల్ : పోలియో చుక్కల మందు కార్యక్రమం చక్కగా జరిగిందని జిల్లా వైద్యాధికారి బి జగన్నాధరావు ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ముగిసే నాటికి 97.65శాతం లక్ష్యం చేరుకోగలిగామని ఆయన తెలిపారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఉన్న 98,991 మంది చిన్నారులకు గాను 96,678 మందికి పోలియో చుక్కలు వేయగలిగామని ఆయన తెలిపారు. సోమవారం పిహెచ్‌సిల పరిధిలో ఉన్న సబ్ సెంటర్ల వైద్య సిబ్బందితో పాటు ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఇంకా చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి చుక్కలు వేసేలా కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు.

3061 మందికి పోలియో చుక్కలు

తాడికొండ పిహెచ్‌సి పరిధిలో గల 3113 మంది చిన్నారులకు 3061 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు డాక్టర్ బుద్దేశ్వర రావు తెలిపారు. మిగిలిన వారికి ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అభిలాష్, సిహెచ్ఒ పద్మ, ఆరోగ్య కార్యకర్తలు శ్రీను, ఎన్ రత్న ప్రసాద్, సింహాచలం యర్రాయమ్మ ఉన్నారు.


సీతంపేట : ఏజెన్సీలో వైద్యాధికారులు 103 కేంద్రాల్లో 5480 చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉంది. ఇప్పటికే 95 శాతం పూర్తయింది. వైద్యాధికారులు, ఎంపిడిఒ, ఐసిడిఎస్ సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతం చేశారు. పెద్దూరులో సర్పంచ్ హెచ్ ఆదిలక్ష్మి పోలియో చుక్కలు వేశారు. ఆ పాత పనుకువలస సర్పంచ్ విజయ కుమారి పోలియో చుక్కలు వేశారు.

సీతానగరం : మండలంలోని పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపిపి బి.రమణమ్మ పల్స్ పోలియో చుక్కల మందులు చిన్నారులకు వేశారు. సీతానగరం, పెద బోగిలి ఎంపిటిసిలు సొరగాల గౌరి, బురిడి కుసుమ సూర్యనారాయణ, పెద భోగిలి సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ పిల్లలకు చుక్కల మందులు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పావని, రమాకాంత్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ, బస్టాండ్ వద్ద, ఇటికి బట్టీల వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 3వేలకు పైగా పిల్లలకు, పెదంకలా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 1500 మంది పిల్లలకు చుక్కల మందులు వేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమాన్ని జిల్లా వైద్య అధికారి బి.జగన్నాధరావు సీతానగరం అంగన్వాడీ కేంద్రాల్లో పరిశీలించారు. అలాగే జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్రావు కృష్ణయ్యపురం ఇటుక బట్టీలు పిల్లల వద్దకు కార్యక్రమంలో సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : నగర పంచాయితీ పరిధిలో 15 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి 0 నుండి 5 ఏళ్ల చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలోని,పట్టణంలో ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాల్లో చిన్నారులకు కమిషనర్ ఎస్ సర్వేశ్వరరావు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పిహెచ్‌సిలు, అంగన్వాడీలు, గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు, బస్టాండ్లు, ఇతర ముఖ్య కూడళ్లలో పోలియో చుక్కలు వేయాలని సూచించారు. అలాగే పలుచోట్ల కౌన్సిలర్లు వారి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమాల్లో సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, వైద్య, మెప్మా, నగర పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం : పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



బలిజిపేట : పిల్లలకు పోలియో చుక్కలు డిఎంఒ జగన్మోహనరావు



వీరఘట్టం : పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కళావతి

జియ్యమ్మవలస : మండలంలోని జియ్యమ్మ వలస, రావడ- రామభద్రపురం వైద్యాధికారులు డాక్టర్ పి.జగదీష్, డాక్టర్ సిహెచ్ శంకర్రావు ఆధ్వర్యాన పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. జియ్యమవలస పిహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ 3971 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 3863 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. అలాగే రావాడ రామభద్రపురం పిహెచ్‌సి పరిధిలో గల 16 గిరిజన బూత్‌ల ద్వారా 1360 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

గరుగుబిల్లి: స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు పరిశీంచారు. అనంతరం పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ బిడ్డిక చిన్నమ్మి, అంగన్వాడి వర్కర్ రౌతు పద్మ తదితరులు ఉన్నారు. అలాగే మండలంలోని రావివలస ఎంపీటీసీ కోట భరత్, నాగూరులో సర్పంచ్ కేతిరెడ్డి శిరీష పిల్లలకు పోలియోచుక్కలు వేశారు. కార్యక్రమంలో శ్రీ చంద్ర శేఖర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కేతిరెడ్డి కూర్మినాయుడు, కేతిరెడ్డి అచ్యుతరావు, అక్కేన వెంకటనాయుడు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బత్తిలి, భామిని, బాలేరు పిహెచ్‌సిల పరిధిలోని గ్రామాల్లో వైద్యాధికారులు పసుపులేటి సోయల్, దీపికారాణి, కొండపల్లి రవీంద్ర, వైద్య సిబ్బంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో 97.6 శాతం పల్స్ పోలియో పూర్తి చేశామని చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ దామోదర్, డాక్టర్ సంతోషలక్ష్మి, డాకట్ర్ శివకుమార్ పాల్గొన్నారు.

వీరఘట్టం : రెండు పోలియో చుక్కలు ఆరోగ్యానికి ఎంతో మేలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలంలోని వండవలో పల్స్ పోలియోకార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అలాగే కత్తులకవిటిలో జడ్పిటిసి జంపు కన్నతల్లి, కొట్టుగుమ్మడలో మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, సర్పంచులు, అధికారులు, 0.5సంవత్సరాలు లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పిపి ఉమామహేశ్వరి, మానస వైద్య సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక వైద్యాధికారి పి ఉమా మహేశ్వరి మాట్లాడుతూ మండలంలోని 3850 మంది చిన్నారులకు గాను 3688 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశమని, 95.79 శాతం నమోదైనట్లు తెలిపారు .



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న వెంకటాపురం గ్రామస్తులు

భవన నిర్మాణ కార్మికుల మద్దతు కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి భవిష్యత్తులో వైసిపికి మద్దతు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. బెలగాం ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్యకర్తలు, మేస్త్రీలంతా కలిసి ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకొని వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం జరిగింది. గతంలో ఇసుక విషయంపై చేసిన ధర్నాలో భాగంగా తమలో కొంతమందిపై కేసులు నమోదయ్యాయని, వీటిని ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని కోరగా, తక్షణమే స్పందించడమే బదులిచ్చారు. అలాగే భవననిర్మాణ కార్మికుల సంఘానికి ఒక స్థలం కావాలని కోరగా తప్పక చూడడం జరుగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.గురురాజు, నాయకులు పైడాన అప్పారావు, మజ్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వెంకటాపురం ప్రజలు కృతజ్ఞతలు

సీతానగరం : మండలంలోని అంటిపేట పంచాయతీ వెంకటాపురానికి బిటి రోడ్డు మంజూరు చేసిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. 50 ఏళ్లగా ఆశగా ఎదురుచూస్తున్న తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించినందుకు ఎమ్మెల్యేను అభినందించారు. ఈ మేరకు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయానికి వెళ్లి నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో సీనియర్ నాయకులు సిరికి మహేష్, ఏలమల దానబాబు, ఏలమల అప్పలనాయుడు, సిరికి శ్రీనివాసరావు, యువత, పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుమ్మిడి చుట్టూ అల్లుకుంటున్న కులవివాదం

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు, నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి చుట్టూ కులవివాదం అల్లుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా ఆమె ఎస్టీ కాదంటూ ఆదివాసీ వికాస్ పరిషత్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వాస్తవానికి ఆమె కులవివాదంపై ఎప్పటి నుంచో రగడ మొదలైంది. కానీ ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకుని ఫిర్యాదులపై విచారణ చేపట్టకపోవడంతో కులవివాదాలు అలాగానే మిగిలిపోతున్నాయి. దీనివల్ల నిజమైన గిరిజనుల ప్రయోజనాలు, హక్కులకు భంగం వాటిల్లుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బోగస్ గిరిజన ధ్రువపత్రాలతో కొంతమంది నాయకులు ఎన్నికల్లో పోటీ చేయడం, గెలుపొందడం గత కొంతకాలంగా జరుగుతోంది. నిజమైన గిరిజనులు అనుభవించాల్సిన రాజకీయ ప్రయోజనాలను బోగస్ గిరిజనులు అనుభవించడం వెనుక పాలకపార్టీల అండదండలు ఉన్నాయనేది స్పష్టమవుతోంది. మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, మాజీ ఎంపి కొత్తపల్లి గీత, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ కూడా ఎస్టీ కాదంటూ గిరిజన సంఘాలు పోరాటం చేశాయి. ప్రస్తుతం అధికారపార్టీకి చెందిన కొంతమంది నాయకులు కూడా కులవివాదాలు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ప్రతిపక్ష పార్టీ కి చెందిన నాయకులపై కులవివాదాలు తలెత్తితే ఒకలాగ, అధికారపార్టీ నాయకులపై ఫిర్యాదులందితే మరోలా వ్యవహరించడం పాలకపార్టీలకు అలవాటుగా మారింది. 1999లోనే మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి ఎస్టీ కాదని ఫిర్యాదు చేశారు. అయితే ఆమె ఎన్నికలలో పోటీ చేసినప్పుడు మాత్రమే ఫిర్యాదు చేయడం ఆ తర్వాత వదిలేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. బోగస్ కులవివాదాలపై గిరిజన సంఘాలకూ ఏకాభిప్రాయం లేకపోవడం, కొంతమంది గిరిజన సంఘాల నాయకులు బోగస్ గిరిజన నాయకులకు వత్తాసు పలకడం పెద్ద తలనొప్పి గా మారుతోంది. 2009 ఎమ్మెల్యేగా, 2014లో ఎంపీగా పోటీ చేసినప్పుడు సంధ్యారాణిపై ఫిర్యాదులు చేశారు. 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఎన్నికలు మరో 40రోజుల్లో రానున్న నేపథ్యంలో ఆమెపై మళ్లీ కులవివాదాన్ని తెరపైకి తీసుకొచ్చారు.

ఎన్నికలప్పుడే కులం గుర్తొస్తుందా? : సంధ్యారాణి

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే : రేగు మహేష్

కులవివాదం వెనుక ఎవరున్నారో తెలుసు : సంధ్యారాణి

తనపై కులవివాదాన్ని తీసుకురావడం వెనుక ఎవరున్నారో తెలుసు. 2021లో తాను ఎస్టీ కాదని ఫిర్యాదు చేసినప్పుడు ప్రభుత్వం ఎందుకు విచారణ చేపట్టలేదు. 1999 నుంచి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు మాత్రమే ఫిర్యాదులు చేస్తున్నారు. నా తండ్రి జన్ని ముత్యాలు ఎమ్మెల్యేగా అనేక ప్రయోజనకరమైన కార్యక్రమాలు చేపట్టారు.

కులవివాదం పై విచారణ కు సిద్ధపడాలి

రేగు మహేష్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం న్యాయ సలహాదారు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణిపై వచ్చిన కులవివాదం నేపథ్యంలో ఆమె విచారణకు సిద్ధం కావాలి. జిల్లా స్థాయి పరిశీలక కమిటీ విచారణకు సిద్ధమని ఆమె అధికారులకు చెప్పాలి. ఆమె ఎస్టీ కాదని అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. కానీ ప్రభుత్వాలు విచారణకు ఆదేశించలేదు. అధికారులపై ఒత్తిడి పెంచి విచారణ జరగకుండా అడ్డుకుంటున్నారు. నేను ఎవరినీ బ్లాక్ మెయిల్ చేయలేదు. బోగస్ కులవివాదాలపై నిజాయితీగా పోరాడుతున్నాను. 2014లో అరుకు ఎంపిగా పోటీ చేసినప్పుడు గెలిచిన కొత్తపల్లి గీతపై సంధ్యారాణి కేసు వేశారు. కానీ ఆ తర్వాత కేసు నుంచి ఎందుకు తప్పుకున్నారో, ఎంత సొమ్ము తీసుకున్నారో చెప్పాలి. 2019 ఎన్నికల్లో వైసిపి నుంచి రెండు కోట్ల రూపాయలు తీసుకుని టిడిపి అభ్యర్థి భంజ్ దేవ్‌ను ఓడించారని మక్కువ మండల పార్టీ నాయకులు ఆరోపించారు. దీనిపై ఆమె ఎందుకు స్పందించలేదు. జిల్లాస్థాయి పరిశీలక కమిటీ విచారణకు ఆదేశించాలని కోరుతూ త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తారు.

'సూపర్ సిక్స్'ను ప్రతిఒక్కరికీ అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

బాబు ష్యూరిటీ ...భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని పట్టణ టిడిపి అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు బల్ల హరిబాబులు కోరారు. ఆదివారం జామి కాంప్లెక్స్‌లో పట్టణ టిడిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాల వివరాలను ఆయా కుటుంబాల వారికి వివరించాలన్నారు. వీరంతా ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనడమే కాకుండా టిడిపి విధి విధానాలను కూడా వివరిస్తారని వారు తెలిపారు. వీరంతా సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తూముల రమేష్ రాయపల్లి రత్నాకర్ రావు జామి సింహాచలం జలుమూరు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు .

సీతంపేట : బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మండలంలోని బెన్నరాయి, ఇప్పగూడ, జలుబు గూడా, వలస గూడా, లాడా పెద్ద గూడలో మండల టిడిపి అధ్యక్షుడు సవర తోట ముఖలింగం, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు గంటా సుధ,నియోజవర్గం సోషల్ మీడియా కోఆర్డినేటర్ ముటక భారత్ రాజు, యూనిట్ ఇంఛార్జి సోను,ఉమ నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ గెలిస్తేనే ప్రజలకు భవిష్యత్ ఉంటుందని రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మరిచి ప్రజలకు అమలు చేయడంలో విఫలం అయిందని విమర్శించారు. టిడిపికి మహిళలంతా అండగా ఉండి, పార్టీ గెలుపునకు కృషికి ఏయాలని కోరారు కార్యక్రమం లో రాంమూర్తి, వెంకటేష్ , ధర్మారావు, ప్రసాద్, ఎలీషా,బాలరాజు,చిన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతంపేట : ఇప్పలగూడలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు ముఖలింగం

కొమరాడ : రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు అన్నారు. ఆదివారం చంద్రంపేటలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మండలంలోని విక్రంపురం పంచాయతీ చంద్రంపేటలో సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విక్రంపురం ఎంపిటిసి అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి అధోగతి పట్టిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం పక్కన పెడితే అభివద్ధి శూన్యమని అన్నారు. త్వరలో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీలన్నీ నెరవేరుస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో పొట్లూరు వెంకట నాయుడు, గొట్టపు తినాధ, పల్లి రామారావు, బూత్ కన్వీనర్ శశిభూషణరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కండి : జనసేన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జనసేనపార్టీ కార్యకర్తలంతా సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని. ఆ పార్టీ జిల్లా నాయకులు చందక అనిల్ కుమార్ అన్నారు. పట్టణంలో సౌందర్య థియేటర్ జంక్షన్ వద్ద ఉన్న జనసేన కార్యాలయంలో పట్టణంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, కోఆర్డినేటర్లతో ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు రాజకీయ వాస్తవాలు, ఎన్నికల కీలక అంశాలను ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన చేపట్టాల్సిన బాధ్యతలను, పట్టణ ప్రజల్లోకి తీసుకొని వెళ్లాల్సిన అంశాలను, వార్డ్ పర్యటన, బూత్ మేనేజ్మెంట్ అలా మరికొన్ని కీలక అంశాలపైన చర్చించారు. సమావేశంలో పట్టణ సీనియర్ నాయకులు, రాజాన రాంబాబు, ఇజ్జాడ కాళీ, నెయ్యిగాపుల సురేష్, బంటు శిరీష్, మానేపల్లి ప్రవీణ్, సిరిపురపు గౌరీ, రాజాన బాలు, బోనెల గోవిందమ్మ, వంగలపుడి నాని, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నజనసేన నాయకులు, కార్యకర్తలు



రాయగడజమ్ములో ప్రచారం చేస్తున్న జగదీశ్వరి

గిరిజనాభివృద్ధికి కృషి చేస్తా

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనులంతా ఒకే తాటిపై నిలబడి టిడిపి-జనసేన కూటమి అభ్యర్థి అయిన తనను రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కురుపాం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. మండలంలోని రాయగడజమ్ము పంచాయతీ పరిధిలో గల పెంగవ, రాయగడ జమ్ములో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు ఘనంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి మాట్లాడుతూ గిరిజన ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఒక గిరిజన మహిళ ఎమ్మెల్యేగా గెలిచినప్పుడే తోటి గిరిజనుల అభివృద్ధికి వీలుంటుందన్నారు. పెంగవ, రాయగడజమ్ము గ్రామాల నుంచి 60 గిరిజన కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలోకి చేరాయి. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేష్, మహిళా ప్రధాన కార్యదర్శి వెంపటాపు భారతి, మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్చార్జ్ దాసు, యూనిట్ ఇంచార్జ్ అనిల్, సోమారావు, మాజీ సర్పంచ్ కిల్లక జ్యోతి, నాయకులు ధర్మారావు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్యపీఠంలో విశేష హోమాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో గల శ్రీ సూర్య పీఠంలో ఆదివారం మాఘమాస భానువార ప్రయుక్త సూర్య అథర్వశీర్ష, మహాసౌర, సర్పసూక్త పారాయణలు, హోమం, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, మిత్ర రవి సూర్య భాను ఖగ పూష హిరణ్యగర్భ మరీచి ఆదిత్య సవిత అర్క భాస్కర దేవతలకు పూజలు జరిగాయి. సూర్య అథర్వశీర్ష , సర్ప సూక్త మంత్ర పారాయణాలు, మహాసౌర మంత్ర హోమాలు బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆశీస్సులతో జరిగాయి. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, టిఆర్.కృష్ణశర్మ వైదిక సహకారం అందించారు.